క్లుప్తంగా

ముగిసిన యోగా మహోత్సవం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన యోగా మహోత్సవం ఆదివారం ముగిసింది. మహోత్సవంలో భాగంగా హార్ట్ ఫుల్‌నెస్ సమన్వయకర్తలు స్వరూపరాణి, చైతన్య, ఆంజనేయులు, లింగంగౌడ్, లక్ష్మి యోగాసనాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందని వివరించారు.

తిరుమలలో హరినామ సంకీర్తన



స్టేషన్ మహబూబ్‌నగర్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ పిలుపు మేరకు తిరుపతిలో ఈనెల 13, 14 తేదీల్లో స్థానిక రాంనగర్ శ్రీబాలాంజనేయస్వామి భజన మండలి సభ్యులు హరినామ సంకీర్తనలు నిర్వహించినట్లు అధ్యక్షుడు పోతుల రాంరెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు హరినామ సంకీర్తనలు ఆలపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు బాలకిష్టప్ప, నాయిని నారాయణగౌడ్, పసుల అంజిరెడ్డి, సత్యనారాయణ, శంకర్, కృష్ణ, రాములు, జి.ఆంజనేయులు, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, వి.సత్యనారాయణచారి, శరభన్‌జీ, గోవిందు, డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ప్రత్యేక పూజలు

నవాబుపేట: మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వంటలను చేసుకొని అక్కడే భుజించారు.

వెంచర్ పరిశీలన

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం శివారులో గల కురుమూర్తి స్వామి ఆలయ సమీపంలో వెలసిన వెంచర్‌లో అక్రమంగా మిషన్ భగీరథ పైపులను ఏర్పాటు చేసుకున్నారని కొందరు ఫిర్యాదు చేయడంతో ఆదివారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ వెంచర్ యజమానులు సొంత పైపులను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ రఘు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయటంపై కృతజ్ఞతలు తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయండి

మహమ్మదాబాద్: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని జిల్లా కేంద్రంలో తలపెట్టిన ర్యాలీకి మహమ్మదాబాద్, గండేడ్ మండలాల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆదివారం జిల్లా కార్యదర్శి చంద్రకాంత్ ఆధ్వర్యంలో అధికసంఖ్యలో తరలివెళ్లారు. చంద్రకాంత్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానంతో ఉద్యోగుల గౌరవం పెరిగి ఆత్మవిశ్వాసంతో బతికే అవకాశం ఉందన్నారు.

చౌదర్‌పల్లిలో 'బలగం' ప్రదర్శన



పాలమూరు: మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఆదివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సినిమాను ఆసక్తిగా తిలకించారు. చిత్రంలోని కుటుంబ అనుబంధాలను తెలిపే సన్నివేశాలను చూసి పలువురు బావోద్వేగానికి గురయ్యారు.

జూనియర్ లైన్‌మెన్‌కు గాయాలు

మిడ్జిల్: మండలంలోని వేములలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న జితేందర్ ఆదివారం గ్రామంలో రైతుల వ్యవసాయ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు.

మట్టి రోడ్లే దిక్కు



యాదవ కమ్యూనిటీ హాలు ఎదురు గల్లీలో అసంపూర్తిగా రోడ్డు

- వీరభద్రకాలనీలో మట్టి రోడ్లతో ఇబ్బందులు
- పైపులు పగిలి తాగునీటికి ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

వార్డు 14
జనాభా 5,612
ప్రధాన వీధులు:
ఎర్రమన్నుగుట్ట (కొంత భాగం), వీరభద్రకాలనీ, పెద్ద శివాలయం ప్రాంతం, కేటీఆర్‌నగర్ (డబుల్ బెడ్‌రూం ఇళ్లు), మాతామాణికేశ్వరికాలనీ.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 14వ వార్డులో ఎన్నో సమస్యలు తాండవిస్తున్నాయి. రైల్వే పాత గేటు నుంచి కేటీఆర్ నగర్ (డబుల్ బెడ్రూం ఇళ్లు) వరకు 2.5 కి.మీ.లలో కొంత భాగం గతంలోనే సీసీ, మరికొంత భాగం బీటీ రోడ్డు నిర్మించారు. మధ్యలో పావు కిలోమీటరు వరకు మట్టిరోడ్డే అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుకు అటు, ఇటు వైపు వీరభద్రకాలనీ విస్తరించింది. మండల పశువైద్యశాల వద్ద సీసీరోడ్డు దెబ్బతింది. ఈ కాలనీలోని గల్లీలలో ఎక్కువగా మట్టి రోడ్లే దిక్కయ్యాయి. చాలావరకు డ్రెయినేజీలు నిర్మించలేదు. దోమల బెడదతో చిన్నారులు తరచూ డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అక్కడక్కడా ఉన్న డ్రెయినేజీలు శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య కార్మికులు రారని వాపోతున్నారు. అప్పుడప్పుడు దోమల నివారణకు ప్రధాన రోడ్డుపైనే ఫాగింగ్ చేస్తున్నారని, గల్లీల లోపలికి రావడం లేదన్నారు. మూడు రోజులకోసారి మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీరు వస్తున్నా సరిపోదని చెబుతున్నారు. పైపులు పగిలినప్పుడు వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు. యాదవ కమ్యూనిటీ హాలుకు ఎదురుగా ఉన్న ఈ వీధి మొత్తం లోతట్టు ప్రాంతమే. స్థానికులు స్వచ్ఛందంగా మట్టి, మొరంతో తాత్కాలికంగా రోడ్డు నిర్మించుకున్నారు. ఎనిమిది నెలల కిందట మున్సిపల్ అధికారులు దానిపై కొంత మేర కంకర వేసి వదిలేశారు. ఎవరూ నడవలేని పరిస్థితి నెలకొంది. ఇక వర్షాకాలంలో నడుము లోతు వరకు ఓపెన్ ప్లాట్లన్నీ నీటితో నిండిపోతాయి. ఓ ఇంటికి వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఇక పట్టణానికి దూరంగా గుట్టల మధ్య సుమారు మూడేళ్ల కిందట నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల (కేటీఆర్ నగర్)లో వేయి మందికి పైగా నివాసం ఉంటున్నారు. ఇక్కడ కూరగాయల మార్కెట్‌కు షెడ్లు నిర్మించినా ఇంకా ప్రారంభించలేదు. దీంతో 4కి.మీ. దూరంలోని పెద్ద మార్కెట్ (టీడీగుట్ట సమీపం)లో రైతుబజార్ నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు చెబుతున్నారు. కొన్ని గల్లీలలో ఇంకా మట్టి రోడ్లే దిక్కయ్యాయి. పార్కుల కోసం రెండు మూడుచోట్ల స్థలం వదిలినా ఇంకా ఏర్పాటు చేయలేదన్నారు. రాత్రివేళ తరచూ కొందరు వ్యక్తులు తాగి గొడవపడి రోడ్డుపై వెళ్లే వారిని బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఖాళీ సీసాలను ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారన్నారు. పెద్ద శివాలయం వెనుక భాగంలోని మాతా మాణికేశ్వరి కాలనీలో కిలోమీటరు పొడవునా కంకర తేలి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ ఆలయానికి వెళ్లేందుకు ఇదొక్కటే దారి. ఈ కాలనీతో పాటు ఎర్రమన్నుగుట్ట, కేటీఆర్‌నగర్ (డబుల్ బెడ్రూం ఇళ్ల)లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.



కేటీఆర్‌నగర్‌కు వెళ్లే మట్టి రోడ్డుపై పారుతున్న మురుగు

సీసీరోడ్డు నిర్మించాలి..



వీధిలో స్వచ్ఛందంగా చుట్టుపక్కల వారందరం కలిసి మట్టి, మొరంతో రోడ్డు నిర్మించుకున్నాం. వర్షాకాలం వస్తే మొత్తం కొట్టుకుపోతుంది. ఎనిమిది నెలల కిందట మున్సిపల్ అధికారులు వచ్చి దానిపై కొంత కంకర వేసి అలాగే వదిలేశారు. దోమల నివారణకు గల్లీలలోకి వచ్చి ఫాగింగ్ చేయాలి.

– లక్ష్మణ్‌నాయక్, కాలనీవాసి, వీరభద్రకాలనీ

కుక్కల బెడద ఎక్కువగా ఉంది..



కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. అక్కడక్కడా వీధి లైట్లు సరిగా వెలగడం లేదు. రోడ్లు ఊడ్చడానికి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులెవరూ రారు. ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోతోంది. తరచూ కొందరు వ్యక్తులు రాత్రివేళ తాగి గొడవ పడుతున్నారు.

– కిరణ్, కేటీఆర్ నగర్

వార్డుపై వివక్ష చూపుతున్నారు..



మూడేళ్ల కాలంలో కేవలం రూ.60లక్షల విలువజేసే అభివృద్ధి పనులు మాత్రమే పూర్తయ్యాయి. పెద్ద శివాలయం సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద సీసీరోడ్డు వేయిస్తాం. మా వార్డుపై అధికారులు, పాలకులు వివక్ష చూపిస్తున్నారు. ప్రతిపక్షం నుంచి గెలవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. చాలా చోట్ల సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. కాలనీల్లో ఎన్నో సమస్యలు పేరుకుపోయాయి.

– ఎ.అంజయ్య, కౌన్సిలర్, 14వ వార్డు

కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మోనప్పగుట్ట మోనేశ్వరస్వామి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. బెల్టు గ్రేడింగ్ పరీక్షలో దాదాపు 55మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా వివిధ బెల్టులు అందజేశారు. అనంతరం జీకే మాస్టర్ షోటోకాన్ బ్లాక్‌బెల్టు ఫెడరేషన్ జిల్లా, పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్, సలహాదారుడిగా నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బాలును ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా జి.రాజు, సలహాదారుడు బాల్‌రాజు, ఉపాధ్యక్షులుగా పి.సత్యనారాయణ, నవీన్‌కుమార్, ఎం.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీధర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా జి.శ్రీనివాసులు, అఖిలేశ్వర్‌రెడ్డి, జి.ప్రసాద్, కోశాధికారిగా ఈ.వెంకటస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం.మారుతి, నరేందర్, ఈ.అనిత, బి.రవిలను ఎన్నుకున్నారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి..

బెల్టు గ్రేడింగ్ పరీక్షలు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సర్టిఫికెట్లు అందజేశారు. కరాటే పంచెస్‌లు చేయించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థులు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్, ఇతర క్రీడల్లో శిక్షణ తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా, పట్టణ కమిటీ సభ్యులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ జి.కృష్ణయ్య, ఎగ్జామినర్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఇలియాజ్ బిన్ సిద్ధిఖీ, శివకుమార్, నాగరాజుగౌడ్, శ్రీధర్,రాజు, వెంకటస్వామి, రాజేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్

స్టేషన్ మహబూబ్‌నగర్: హక్కుల సాధన కోసం ముస్లింలు ఉద్యమించాలని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆల్‌మేవా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నప్పటికీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు ముస్లింలకు ఇచ్చిన హామీలు ఏవీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. దళితబంధు, గిరిజనులకు 10శాతం రిజర్వేషన్, తండాలను గ్రామ పంచాయతీలుగా మారుస్తూ ఇచ్చిన హామీలు అమలు చేసినా, ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయలేదన్నారు. ఉర్దూను రెండో ఐచ్ఛిక భాషగా ప్రవేశపెడుతామని చెప్పి గాలికొదిలేశారని, ముస్లిం ఆవాస ప్రాంతాల్లో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభిస్తామని అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ముస్లిం మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, యువత ఆలోచన చేసి ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఆల్‌మేవా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఇఫ్రత్ అలీ, మహ్మద్ అయూబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ వహీద్‌షా, కోశాధికారి అబ్దుల్ రషీద్, నాయకులు మహ్మద్ ఆరిఫ్, హనీఫ్‌ఖాన్, జైనుల్లా అబెదిన్, సిరాజ్‌ఖాన్, సులేమాన్, ఖమర్, మహ్మద్ షరీఫ్, ఖాజా నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌తో సోదరభావం పెంపు



జడ్చర్లలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇఫ్తార్ విందులతో కుల, మత బేధాలు లేకుండా సోదరభావం పెంపొందుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఎంఐఎం ఆధ్వర్యంలో రామయ్యబౌలీలో, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు రాశెద్‌ఖాన్ రోజ్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్, న్యూప్రేమ్‌నగర్‌లోని అన్వారే మదీనా మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందుల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ముస్లింలకు ఫలహాలు అందజేశారు.

ఆల్‌మేవా ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎన్పీ వెంకటేశ్, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు మోసిన్‌ఖాన్, మోసిన్, ఇమ్రాన్, అబ్రార్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు వహీద్‌షా తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని జామియా మసీదులో ఆదివారం రాత్రి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఇఫ్తార్ విందుకు హాజరై ఉపవాస దీక్షలు ఉన్న ముస్లింలకు పండ్లను తినిపించి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు అభిలాష్‌రావు, ప్రశాంత్, విజయమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

రాజాపూర్: మండల కేంద్రంలో టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఆదివారం టీజీసీజీటీఏ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.తిరుపతయ్య, కార్యదర్శిగా డా.జి.రాజేందర్, కోశాధికారిగా వి.పుష్పలత, ఉపాధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రామరాజయాదవ్ వ్యవహరించారు. వీరిని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాఘవేంద్రరెడ్డి, శివలీల, సత్యనారాయణగౌడ్, నరసింహారావు అభినందించారు.

రంజాన్ కానుకల పంపిణీ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ఆదివారం ముస్లింలకు రంజాన్ కానులను పంపిణీ చేశారు. రంజాన్ పండగను పురస్కరించుకుని ప్రభుత్వం సరఫరా చేసిన కానుకలను నిరుపేద కుటుంబాలకు స్థానిక నాయకులు అందజేశారు.

దళితరత్న అవార్డు



మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి సేవలను గుర్తించిన ప్రభుత్వం దళితరత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్‌తో కలిసి వెంకటస్వామికి శాలువా కప్పి దళితరత్న అవార్డును ప్రదానం చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

అడ్డాకుల: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతాయని ఎస్‌ఐ విజయభాస్కర్ అన్నారు. మూసాపేట మండలం వేములలో బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్‌గౌడ్ రెండు రోజుల పాటు నిర్వహించిన వేముల సమ్మర్ ప్రీమియం లీగ్ ఆదివారం ముగిసింది. స్థానిక గ్రామానికి చెందిన యువకులు 9జట్లుగా ఏర్పడి పోటీల్లో పాల్గొనగా, గెలుపొందిన జట్లకు ఎస్‌ఐ విజయభాస్కర్ బహుమతులను అందజేశారు. బోయ బుచ్చన్న అండ్‌టీం జట్టుకు మొదటి బహుమతితో పాటు రూ.12వేలు, కార్తీక్ అండ్ టీంకు రెండో బహుమతితో పాటు రూ.6వేలను అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



ఉదండాపూర్‌లో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం కావేరమ్మపేట శివారులో రూ.కోట్ల వ్యయంతో చేపట్టే ఉదండాపూర్ ప్రధాన రహదారి విస్తరణ బీటీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల రహదారులను పూర్తి స్థాయిలో బీటీ రోడ్లుగా మార్చామని, సింగిల్ రోడ్లను సైతం డబుల్‌రోడ్లుగా విస్తరిస్తున్నామన్నారు. ఉదండాపూర్ం రోడ్డును రెండు నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలు పార్టీకి కుటుంబం..

నవాబుపేట: ప్రతి కార్యకర్త పార్టీకి కుటుంబ సభ్యుడేనని, వారికి ఎలాంటి అవసరం వచ్చినా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పర్యటనకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల్లో మొత్తం వందశాతం కార్యకర్తలను సమ్మేళనం పేరుతో కలుస్తున్నట్లు వివరించారు. అనంతరం మండలంలోని జంగమయ్యపల్లి సర్పంచ్ వెంకటేష్ తల్లి వెంకటమ్మ మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే దరిపల్లిలో నర్సింహులు కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. నర్సింహారెడ్డి, నవాబుపేటకు చెందిన మరికంటి నర్సింహులు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. మైసమ్మ ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డితో ఆయన భూవిషయమై చర్చించారు. అటవీ శాఖ అప్పగించిన భూమి మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, ప్రతాప్, సర్పంచ్ గోపాల్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య ఉన్నారు.

రైతులను ఆదుకుంటాం..

రాజాపూర్: వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామ పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, సర్పంచ్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి కష్టపడితేనే ఫలితం...

బాలానగర్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నంగులగడ్డ తండా, ఎక్వాయపల్లిలో నిర్వహించిన ఉమ్మడి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

బీటీరోడ్డు మంజూరెప్పుడు?

- మట్టిరోడ్డుతో తాళ్లగడ్డ గ్రామస్తుల అవస్థలు
- చెరువు కట్టపై ప్రమాదకరంగా ప్రయాణం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట అనుబంధ గ్రామమైన తాళ్లగడ్డకు సరైన రోడ్డు వసతి లేదు. జానంపేట నుంచి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న తాళ్లగడ్డకు జానంపేట నుంచి మట్టిరోడ్డే ఉంది. జానంపేట శివారులో ఉన్న గంగారం చెరువు కట్టపై ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇక్కడ ఒకవైపు చెరువు, మరో వైపు పంట పొలాలు కిందికి ఉండటంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టపై సుమారు అర కిలోమీటర్ దూరం ప్రయాణం చేయాల్సి ఉంది. కట్టపై వాహనాలు అదుపు తప్పితే చెరువులో పడిపోక తప్పదు. చెరువు కట్ట తర్వాత తాళ్లగడ్డ వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో రోడ్డంతా బురదగామారి వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారు. పదిహేనేళ్ల కిందట జానంపేట వద్ద పాత జాతీయ రహదారిని తవ్వి బీటీ మెటల్‌ను అప్పట్లో తాళ్లగడ్డ రోడ్డుపై వేశారు. దీనివల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తర్వాత మెటల్‌పై మట్టిని వేయించడంతో వాహనాలు వెళ్లడానికి కొంత అనువుగా మారింది.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన..

జానంపేట శివారులోని గంగారం చెరువు నిండితే అలుగు పారుతుంది. ఇక్కడ అలుగు వద్దే కట్టను ఎక్కాల్సి ఉంటుంది. వర్షాకాలంలో చెరువు నిండినప్పుడు రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. చెరువు కట్ట అలుగు వద్ద వర్షాకాలంలో గ్రామస్తులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అలుగు దాటాల్సి వచ్చేది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు కట్ట అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇటీవల ఎంఆర్‌ఆర్, ఎఫ్‌డీఆర్ ద్వారా రూ.1.25కోట్లను మంజూరు చేయించారు. ఇందులో భాగంగా ఈనెల 2న బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను కూడా ప్రారంభించారు. చెరువు వద్ద బ్రిడ్జి పూర్తయితే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఇదిలా ఉండగా, జానంపేట నుంచి బీటీరోడ్డు వేయిస్తే తమకు రోడ్డు కష్టాలు తీరుతాయని, వెంటనే బీటీరోడ్డు మంజూరు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెరువు కట్టపై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

బీటీరోడ్డు వేయించాలి..



జానంపేట నుంచి మా ఊరి వరకు ఉన్న మట్టి రోడ్డు గుంతలుగా మారింది. రోడ్డుపై ఉన్న గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెరువు కట్టపై ప్రయాణం డేంజర్‌గా ఉంది. జానంపేట నుంచి మా ఊరి వరకు బీటీరోడ్డు వేయించే విధంగా చూడాలి.

– గంగాధర్‌గౌడ్, తాళ్లగడ్డ

ప్రతిపాదనలు పంపాం..



గంగారం చెరువు అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను మొదలు పెట్టారు. జానంపేట నుంచి తాళ్లగడ్డ వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. బీటీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

– లక్ష్మణ్‌గౌడ్, పీఆర్ ఏఈ, మూసాపేట

ఓటర్ జాబితా సర్వే

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మండలంలోని ధర్మాపూర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఓటర్ల సర్వే నిర్వహించారు. వంద మంది ఓటర్ల జాబితాతో ఇంటింటికీ తిరిగి ఓటర్లు ఉన్నారా లేదా అనే తెలుసుకున్నారు. దీంతో పాటు బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో బుచ్చయ్య, యాదయ్య, రాములు, మహేష్, రాజు, యాదవచారీ పాల్గొన్నారు.